# Andhra Jyothi

## జనవరిలో 10వేల టీచర్ పోస్టులు

- త్వరలో గురుకుల పోస్టుల నోటిఫికేషన్
- 25న పశుసంవర్ధక పోస్టులకు: ఘంటా చక్రపాణి



కరీంనగర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జనవరిలో 10వేల టీచర్ పోస్టుల భర్తీ ప్రారంభిస్తామని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఘంటా చక్రపాణి తెలిపారు. గురుకుల పాఠశాలల్లో 5,500 పోస్టుల భర్తీకి వారం,పది రోజుల్లో నోటిఫికేషన్ జారీ చేస్తామని చెప్పారు. శుక్రవారం కరీంనగర్‌లో స్వాతంత్ర్య సమరయోధుడు బోయినపల్లి వెంకటరామారావు జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది చివరినాటికి 35 వేల పోస్టులను భర్తీచేస్తామన్నారు. లక్ష ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోనుందని స్పష్టం చేశారు. బోర్డులు, సొసైటీల ఉద్యోగాల భర్తీ కూడా టీఎస్ పీఎస్సీ ద్వారానే జరుగుతున్నాయన్నారు. ఈనెల 25న పశుసంవర్ధకశాఖలో 2,500 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. నవంబరులో వివిధ పరీక్షలకు 7 లక్షల మంది హాజరుకానున్నారని తెలిపారు. 1,500 వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారుల పోస్టుల భర్తీ.. కోర్టు స్టే వల్ల నిలిచిపోయాయని తెలిపారు. కార్యక్రమంలో బోవెరా సంస్థల అధ్యక్షుడు బోయినపల్లి హన్మంతరావు, ప్రభుత్వ చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్, జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, గోరటి వెంకన్న, తెలంగాణ అమరవీరుల స్థూపం రూపశిల్పి ఎక్కా యాదగిరిరావు, గూడ అంజయ్య సతీమణి గూడ హేమనళిని పాల్గొన్నారు.